
# పోతనభాగవతంలో రసగుళికలు
## – ఆర్.శర్మ దంతుర్తి



## 92 వ భాగం

భగవంతుడి విరాట్ స్వరూపం

క. శ్రీమద్భక్త చకోరక
సోమ! వివేకాభిరామ! సురవినుత గుణ
స్తోమ! నిరలంకృతాసుర
రామా సీమంతసీమ! రాఘవరామా! [2-1]

శుక మహర్షి భాగవతం కథ మొదలుపెట్టడానికి కారణం పరీక్షిత్తు శాపానికి గురవ్వడం అని తెల్సిందే కదా? తనకి ఒక్క వారంలో చావు రాసిపెట్టి ఉంది, ఏం చేయాలని మధనపడుతున్నప్పుడు శుకమహర్షి వచ్చాడు. "గడువు ఇంకా మరోవారం ఉంది కదా, ఈ లోపునే భగవంతుడి గురించి విని/ఆలోచించి ముక్తి పొందవచ్చు, దీనికి భాగవతం వినడమే సులభమైన పద్ధతి," అని చెప్పి మొదలుపెడుతున్నాడు. ఎప్పటి లాగానే పోతన ఈ రెండో స్కంధం మొదలు పెట్టే ముందు రాముడికో కందం రాసి మొదలు పెట్టాడు. పై పద్యంలో 'శ్రీమద్భక్త చకోరక సోమ' అంటే గొప్ప చకోరపక్షులవంటి భక్తులకి చంద్రుడంతటివాడా అని. 'నిరలంకృతాసురరామా సీమంతసీమ' అంటే చెప్పుకోండి చూద్దాం? అసురులంటే రాక్షసులు కదా? నిరలంకృత – నష్టమైన అలంకారములు గల; అసుర – రాక్షస; రామా – స్త్రీల; సీమంత – పాపిటలు; సీమ –ప్రాంతము కలగజేసినవాడా. ఇందులో రామా అంటే పోతన ఎటువంటి అర్థం తీసాడో గమనించారా?

ఈ స్కంధంలోనే ముందు చిన్న కథ చూద్దాం. ఖట్వాంగుడనే ఓ రాజు ఉండేవాడు. దేవతలకి సహాయం చేసి మెప్పు పొందినప్పుడు వాళ్ళు అడిగారుట రాజుని, 'నీకేమైనా కోరికలు ఉంటే చెప్పు తీరుస్తాం' అని. ఆయన అన్నాడుట, 'కోరికలేమీ లేవు గానీ నాకింకా ఎంత ఆయుర్దాయం ఉందో చెప్పండి చాలు.' వాళ్ళు చెప్పారుట 'నీ ఆయుర్దాయం మరో ముహూర్త కాలం మాత్రమే' అని. ముహూర్త కాలం అంటే రోజులో ముప్ఫైయవ వంతు — 48 నిముషాలు. వెంఠనే ఆయన వైరాగ్యం అవలంబించి, గోవింద నామ సంకీర్తనం చేస్తూ సరిగ్గా ఈ రెండు గడియల్లోనే మోక్షం సంపాదించుకున్నాడు.

అందుకే శుకమహర్షి చెప్తున్నాడు పరీక్షిత్తుతో – కనీసం నీకు మరో వారం సమయం ఉంది. అలా వారం మాత్రమే ఉందని కూడా తెలుసు. ప్రపంచంలో జనాలకి ఎవరు ఎప్పుడు పుడతారో, ఛస్తారో తెలియనే తెలియదు. అందువల్ల ఈ వారం అంతా భాగవతం చెప్తాను. విను, అంటూ మొదలుపెడుతున్నాడు.

మొదట్లో అసలు భగవంతుడంటే ఒక రూపు అని అనుకోవడం, తర్వాత తెలిసేది ఈ విశ్వంలో చరాచర ప్రపంచంలో ఉన్నందంతా భగవంతుడు తప్ప మరేమీ కాదని తెలుసుకునే జ్ఞానం. అలా భగవదైక్యం పొందడం లేదా మోక్షం. దానికే మనం చేసే సాధన, ప్రయత్నం ఇదంతా. ఆ భగవంతుడెటివాడో చెప్తున్నాడు ముందు.

వ. వినుము; భగవంతుండైన హరి విరాడ్విగ్రహంబు నందు భూత భవిష్యద్వర్తమానం బైన విశ్వంబు విలోక్యమానం బగు ధరణీసలిల తేజస్సమీరణ గగనాహంకార మహత్తత్వంబు లనియెడి సప్తావరణంబుల చేత నావృతం బగు మహాండకోశం బైన శరీరంబు నందు ధారణాశ్రయం బయిన వైరాజపురుషుండు దేజరిల్లు; నమ్మహాత్మునికిఁ బాదమూలంబు పాతాళంబు; పార్ష్ణిభాగ పాదాగ్ర భాగంబులు రసాతలంబు; గుల్ఫంబులు మహాతలంబు; జంఘలు తలాతలంబు; జానుద్వయంబు సుతలం; బూరువులు వితలాతలంబు; జఘనంబు మహీతలంబు; నాభీవివరంబు నభస్థ్సలంబు; వక్షంబు గ్రహతారకా ముఖ జ్యోతిస్సమూహ సమేతం బగు నక్షత్రలోకంబు; గ్రీవంబు మహర్లోకంబు; ముఖంబు జనలోకంబు; లలాటంబు తపోలోకంబు; శీర్షంబు సత్యలోకంబు; బాహుదండంబు లింద్రాదులు; గర్ణంబులు దిశలు; శ్రవణేంద్రియంబు శబ్దంబు; నాసాపుటంబు లశ్వనీదేవతలు; ఘ్రాణేంద్రియంబు గంధంబు; వదనంబు వహ్ని; నేత్రంబు లంతరిక్షంబు; చక్షురింద్రియంబు సూర్యుండు; రేయింబగళ్ళు ఱెప్పలు; భ్రూయుగ్మ విజృంభణంబు బ్రహ్మపదంబు; తాలువులు జలంబు; జిహ్వేంద్రియంబు రసంబు; భాషణంబులు సకల వేదంబులు; దంష్ట్రలు దండధరుండు; దంతంబులు పుత్రాది స్నేహకళలు; నగవులు జనోన్మాద కరంబు లయిన మాయావిశేషంబులు; కటాక్షంబుల నంత సర్గంబులు; పెదవులు వ్రీడాలోభంబులు; స్తనంబులు ధర్మంబులు; వె న్నధర్మమార్గంబు; మేఢ్రంబు ప్రజాపతి; వృషణంబులు మిత్రావరుణులు; జఠరంబు సముద్రంబులు; శల్య సంఘంబులు గిరులు; నాడీనివహంబులు నదులు; తనూరుహంబులు తరువులు; నిశ్వాసంబులు వాయువులు; ప్రాయంబు నిరవధికంబయిన కాలంబు; కర్మంబులు నానావిధజంతునివహ సంవృత సంసరణంబులు; శిరోజంబులు మేఘంబులు; కట్టు పుట్టంబులు సంధ్యలు; హృదయంబు ప్రధానంబు; సర్వవికారంబులకు నాశ్రయంబైన మనంబు చంద్రుండు; చిత్తంబు మహత్తత్త్వం; బహంకారంబు రుద్రుండు; నఖంబు లశ్వాశ్వత ర్యుష్ట్ర గజంబులు; కటిప్రదేశంబు పశుమృగాదులు; విచిత్రంబులైన యాలాప నైపుణ్యంబులు పక్షులు; బుద్ధి మనువు; నివాసంబు పురుషుండు; షడ్జాదులైన స్వరవిశేషంబులు గంధర్వ విద్యాధర చారణాప్సర స్సమూహంబులు; స్మృతి ప్రహ్లాదుండు; వీర్యంబు దైత్య దానవానీకంబై యుండు; మఱియు న మ్మహావిభునకు ముఖంబు బ్రాహ్మణులును, భుజంబులు క్షత్రియులును, నూరులు వైశ్యులును, జరణంబులు

శూద్రులును, నామంబులు నానా విధంబులయిన వసురుద్రాది దేవతాభి ధానంబులును; ద్రవ్యంబులు హవిర్భాగంబులునుఁ; గర్మంబులు యజ్ఞప్రయోగంబులును నగు; నిట్టి సర్వమయుండైన పరమేశ్వరుని విగ్రహంబు ముముక్షువయినవాడు మనంబున ననుసంధానంబు సేయవలయు" నని వక్కాణించి వెండియు నిట్లనియె.

[2-16]

భూత భవిష్యత్, వర్తమాన కాలాలలో విశ్వమంతా తానే అయినటువంటి భగవంతుడు విరాట్ స్వరూపుడు. విశ్వానికో రూపం ఇస్తే కింది భాగాలు అధోలోకాలు. పై భాగం ఊర్ధ్వలోకాలు. ముందొకసారి వామనావతారంలో చూసాం విజృంభణలో భగవంతుడు ఎలా ఉంటాడో; అదే మరోసారి ఇక్కడ చెప్తున్నాడు. రెప్పలు అహోరాత్రంబులు, వెన్ను అధర్మం. భగవంతుడి నోటిలోంచి వచ్చే భాషణం వేదాలు. తపస్సుచేసేవారు ఎక్కడ దృష్టి సారిస్తారో ఆ లలాటం తపోలోకం. శీర్షంలో ఉండే సహస్రారం చూడగలిగితే చేరేది సత్యలోకం. జగత్తులో జరిగే అనేక మాయావిశేషాలే భగవంతుడి నవ్వు. చివర ఆంటూ లేని సమయమే ప్రాయం (వయస్సు); ఎందుకంటే మోక్షం రావడానికి ముందు ఎన్ని జన్మలెత్తాలో ఎంత కాలం గడుస్తుందో ఎవరికీ తెలియదు కదా? తెలుసుకోవలసినదేమంటే ధర్మాధర్మాలు, పాప పుణ్యాలు, ఇటు మంచివీ అటు చెడ్డవీ అన్నీ కూడా భగవంతుడు తప్ప మరోటి కాదు. ఈ విరాట్ స్వరూపం ఊహించుకుని ధ్యానం ఆరంభించాలి. అన్నీ అయిన ఆయన ఎటువంటివాడంటే,

క. హరిమయము విశ్వ మంతయు,
హరి విశ్వమయుండు, సంశయము పనిలేదా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన; వింటే. [2-17]

ఈ చరాచర ప్రపంచం అంతా కూడా భగవంతుడే. విశ్వం అంతా నిండి వున్నది భగవంతుడు తప్ప మరొకటిలేదు. దీనిలో సంశయానికి తావే లేదు ఎందుకంటే, భగవంతుడు లేని పదార్థం కానీ పరమాణువు కానీ విశ్వం లో లేదు. శాస్త్రీయ విజ్ఞానం కూడా చెప్పేది ఇదే. మొత్తం శక్తి అంతా ఉన్నది ఎక్కడ? అణువుల్లో, పరమాణువుల్లో కదా? మంత్రపుష్పంలో చెప్పినదీ ఇదే (నీలతోయద మధ్యస్థా ద్విదుల్లేఖేన భాస్వరా...తస్యాశిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః). అలా ఈ విశ్వం పుట్టి, ప్రభవించి, లయం అవడానిక్కారణం భగవంతుడు తప్ప మొరొకటి కాదు.

మ. బహు వర్షంబులు బ్రహ్మ తొల్లి జగ ముత్పాదింప విన్నాణి గా
క హరిప్రార్థన ధారణా వశమునం గాదే; యమోఘోల్లస
న్మహనీయోజ్వల బుద్ధియై భువననిర్మాణప్రభావంబుతో
విహరించెన్ నరనాథ! జంతునివహావిర్భావనిర్ణేతయై. [2-19]

భగవంతుడి విభూతి ఇంకా చెప్తున్నాడు. బ్రహ్మ మొదట్లో జగత్తు నిర్మాణానికి ఉపక్రమించినప్పుడు ఏమీ చేత కాలేదు (విన్నాణి గాక – నేర్పు కాక). ఏమి చేయాలో తెలియక తనకి కారణమైన వారెవరా అని తపస్సు చేసినప్పుడు భగవంతుడి వశంచేత గొప్పదైన బుద్ధిబలం వచ్చి భువన నిర్మాణం గావించాడు. చెప్పేదేమిటంటే, భగవంతుడి అనుగ్రహం వల్లే తప్ప ఎవరమూ కూడా ఏ పనీ చేయలేము. "నేను చేస్తున్నాను" అనేదే లేదు ఎందుకంటే, హరిమయము విశ్వమంతయు, అని ముందే చెప్పాడు కదా? అదలా ఉంచితే,

క. రక్షకులు లేనివారల
రక్షించెద ననుచుఁ జక్రి రాజై యుండన్
రక్షింపు మనుచు నొక నరు
నక్షముఁ బ్రార్థింపనేల యాత్మజ్ఞులకున్? [2-22]

రక్షణ లేనివారికి నేను ఉన్నానంటూ చక్రాయుధుడైన భగవంతుడు రాజుగా ఉండగా రక్షించమని మరొక మనిషిని ఆత్మజ్ఞులు, ముముక్షువులు అడగడం ఎందుకు?

వ. వినుము; పరమాత్మ యైన బ్రహ్మంబునకుఁ దక్క కాల దేవ సత్త్వ రజస్తమోగుణాహంకార మహత్తత్త్వ ప్రధానంబులకుఁ బ్రభుత్వంబు లేదు; కావునం బరమాత్మ వ్యతిరిక్తంబు లేదు; దేహాదుల యం దాత్మత్వంబు విసర్జించి యన్య సౌహృదంబు మాని, పూజ్యంబైన హరిపదంబుం బ్రతిక్షణంబును హృదయంబున నాలింగనంబు సేసి, వైష్ణవంబైన పరమపదంబు సర్వోత్తమం బని సత్పురుషులు దెలియుదు; రివ్విధంబున విజ్ఞానదృగ్వీర్యజ్వలనంబున నిర్దగ్ధవిషయవాసనుండయి; క్రమంబున నిరపేక్షత్వంబున.

[2-28]

సృష్టిలో పరమాత్మ అయిన బ్రహ్మనికి తప్ప ఎవరికీ కూడా – కాల, దేవ, సత్వ, రజ, తమో గుణాలకి కానీ అహంకారానికీ కానీ ఎటువంటి అధికారం లేదు. ఇది తెలిసిన జ్ఞానులు ఏం చేస్తున్నారంటే విజ్ఞానమనే మంటలో (విజ్ఞానదృగ్వీర్యజ్వలనంబున) విషయవాసలని నాశనం చేస్తున్నారు (నిర్దగ్ధవిషయవాసనుండయి).

సీ. అంఘ్రిమూలమున మూలాధారచక్రంబుఁ
బీడించి ప్రాణంబు బిగియఁ బట్టి,
నాభితలముఁ జేర్చి, నయముతో మెల్లన
హృత్సరోజము మీఁది కెగయఁ బట్టి,
యటమీఁద నురమందు హత్తించి, క్రమ్మఱఁ
దాలు మూలమునకుఁ దఱిమి నిలిపి,
మమతతో భ్రూయుగమధ్యంబు సేర్చి దృ
క్కర్ణ నాసాస్య మార్గములు మూసి, [2-29]

ఆ. యిచ్చలేని యోగి యెలమి ముహూర్తార్థ
మింద్రి యానుషంగ మింత లేక,
ప్రాణములను వంచి, బ్రహ్మరంధ్రము చించి,
బ్రహ్మ మందుఁ గలయుఁ బౌరవేంద్ర! [2-29.1]

భగవంతుడి మీద దృష్టి నిలిపాక యోగి ఔఇనవాడు మూలాధారం చక్రం అదిమిపెట్టి, ప్రాణవాయువుని నాభిస్థనంలో మణిపూరక చక్రం మీదకీ, అక్కడనుండి హృదయంలో ఉండే అనాహత చక్రానికీ భ్రూయుగం లో (కనుబొమ్మల మధ్య) ఉండే ఆజ్ఞ చక్రం మీదకీ పంపి ఇంద్రియవాసనలు లేక బ్రహ్మరంధ్రం చించి పరబ్రహ్మంలో లీనమౌతాడు. ఇది కొంచెం వినడానికి విచిత్రంగా ఉన్నా స్వామి వివేకానందుల వంటి యోగుల విషయం లో ఇలా జరిగినట్టు ఇప్పటికీ ఆధారాలు ఉన్నాయి.

వ. మఱియునొక్క విశేషంబు గలదు; పుణ్యాతిరేకంబున బ్రహ్మలోకగతులైన వారు కల్పాంతరంబున బుణ్యతారతమ్యంబుల నధికారవిశేషంబు నొందువార లగుదురు; బ్రహ్మాది దేవతాభజనంబునం జనువారు బ్రహ్మజీవిత

కాలం బెల్ల బ్రహ్మలోకంబున వసియించి ముక్తు లగుదురు; నారాయణచరణకమల భక్తి పరాయణత్వంబునం జనినవారు నిజేచ్ఛావశంబున నిరర్గళ గమనులై బ్రహ్మాండంబు భేదించి, వైష్ణవ పదారోహణంబు సేయువాఁడు నిర్భయుండై మెల్లన లింగ దేహంబునఁ బృథివ్యాత్మకత్వంబు నొంది, యట్టి పృథివ్యాత్మకత్వంబున ఘ్రాణంబున గంధంబును, జలాత్మకత్వంబున రసనేంద్రియంబున రసంబును, దేజోరూపకత్వంబున దర్శనంబున రూపంబును, సమీరణాత్మకత్వంబున దేహంబున స్పర్శనంబును, గగనాత్మకత్వంబున శ్రవణంబున శబ్దంబును, నతిక్రమించి భూతసూక్ష్మేంద్రియ లయస్థానంబైన యహంకారావరణంబున సంప్రాప్తుం డై, యందు మనోమయంబును, దేవమయంబును నైన సాత్త్వికాహంకార గమనంబున మహత్తత్త్వంబు సొచ్చి, గుణత్రయంబున లయించి, ప్రధానంబు నొంది, ప్రధానాత్మకత్వంబున దేహంబును, నుపాధి పరంపరావసానంబునం బ్రకృతిం బాసి యానందమయుండై, యానందంబునం బరమాత్మరూపంబైన వాసుదేవ బ్రహ్మంబునందుఁ గలయు"నని చెప్పి వెండియు నిట్లనియె. [2-32]

చేసుకున్న పుణ్యం వల్ల బ్రహ్మలోకం చేరేవారు అది పూర్తయ్యేదాకా ఏదో అధికార విశేషం పొందుతారు. అయితే భగవంతుడి చరణారవిందాలే కావాలనుకునేవారికి ఉపాధి పరంపరలన్నీ ముగిసాక అన్ని రకాల దేహాలనీ విడిచి పరమాత్మ స్వరూపం అయిన బ్రహ్మంలో లీనమౌతాడు. ఇటువంటివారికే జన్మ పరంపర నుండి విముక్తి.

ఆ. పరమ భాగవతులు పాటించు పథ మిది
యీ పథమున యోగి యేఁగెనేని
మగుడి రాఁడు వాఁడు మఱి సంశయము లేదు
కల్పశతము లైనఁ గౌరవేంద్ర! [2-33]

పరమభాగవతులు పాటించే దారి ఇదే. ఈ దారిలో వెళ్ళిన యోగులు – ఎన్ని వందల కల్పాలు జరిగినా సరే వెనక్కి తిరిగి వచ్చే ప్రశ్నే లేదు. ఈ పద్యంలో 'వెనకకి రాదు' అనే పదం గుర్తించారా? మగుడి – వెనకకి. ఈ తిరిగి వచ్చే/రాని విషయం మనం భగవద్గీతలో కూడా చూడవచ్చు.

అగ్నిర్జ్యోతి రహః శుక్ల షణ్మాసా ఉత్తరాయణం
తత్ర ప్రయతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః

ధూమో రాత్రి స్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయణం
తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే [అక్షర పరబ్రహ్మ యోగం 24, 25]

అగ్ని, జ్యోతి, దినము, శుక్ల పక్షము, ఆరుమాసాలు అయిన ఉత్తరారాయణం అనే దేవమార్గంలో ప్రయాణించే పరమేశ్వరోపాసకులు ఎప్పటికీ తిరిగిరాని బ్రహ్మాన్ని చేరుకుంటున్నారు. ధూమము, రాత్రి, కృష్ణపక్షము, మరో ఆరుమాసాలైన దక్షిణాయనం అయిన పితృమార్గంలో పయనించేవారు చంద్రలోకానికి వెళ్ళి ఈ సంసారానికి తిరిగి వస్తున్నారు. గమనించారా? ఉత్తరాయణం, దక్షిణాయనం లో వెళ్ళే 'పరమేశ్వరోపాశకులకే' (బ్రహ్మవిధో జనాః/యోగీ ప్రాప్య) ఇవి వర్తించేది అని స్పష్టంగా చెప్తున్నాడు. మనలాంటి మామూలు జనాలకి కాదు. మనలాంటి వారికి అనేక జన్మలు అలా సంప్రాప్తమౌతూనే ఉంటాయి, చేసుకున్న పాపపుణ్యాల బట్టీ వెంటవచ్చే కర్మలని బట్టీ.

ఈ నెల వ్యాసం ముగించే ముందు పరమహంస యోగానందగారు 'ఒక జీవికి ముక్తి కలగాలంటే ఎన్ని జీవితాలు గడపాలి?' అనే ప్రశ్నకి ఇచ్చిన సమాధానం చూద్దాం. ఆయన చెప్పడం ప్రకారం అరవై లక్షల జీవితాలు పట్టవచ్చుట. వీటిలో అన్నీ మానవ జీవితాలు కాకపోయినా దాదాపు కొంచెంలో కొంచెం లెక్కపెట్టుకోవచ్చు ఒక్కొకరికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో ముక్తి రావడానికి. ఈ జీవితమే ఇలా ఉంది; ముందెన్ని కష్టాలు పడాలో అనే జ్ఞానం వచ్చాక భగవంతుడి గురించి ఆలోచించే జిజ్ఞాస మొదలౌతుంది. అ తర్వాత సన్యాసం, భగవంతుడి గురించి వెదుకులాట, దెబ్బలాటలు, వాదనలూ అన్నీ అయ్యాక ఇవన్నీ వృధా అని తెలిసి భక్తితో పరమేశ్వరుణ్ణి శరణు వేడుకోవడం. అప్పుడు నిజమైన యోగమార్గంలో పడతాం. అక్కడనుంచి మరెన్ని జన్మలు ఎత్తాలో అనేది ఎవరికీ తెలియని చిదంబర రహస్యం.

వచ్చే వ్యాసంలో భగవంతుణ్ణి చేరుకోవడానికి సులభమైన మార్గం ఏమిటో శుకమహర్షి మాటల్లోనే చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS